సాక్షి తిరుపతి

సోమవారం । 11 । డిసెంబర్ । 2023



సాక్షి మ్యాథ్స్ బీ.. స్పెల్ బీ

విద్యార్థులకు గణితం, ఇంగ్లిష్‌పై పట్టు పెంపొందించేందుకు సాక్షి మీడియా గ్రూప్ మ్యాథ్స్ బీ, స్పెల్ బీ పరీక్ష చేపట్టింది. - 8లో



కార్తీక వనమహోత్సవం

శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని భరద్వాజ తీర్థంలో కార్తీక వనమహోత్సవం నిర్వహించారు. - 8లో



తోడుగా నిలుస్తూ..!

పాకాల మండలంలో మృతి చెందిన పలువురికి తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి నివాళులర్పించారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ప్రజల సౌకర్యార్థం అర్జీలు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను ఏర్పాటు చేశామన్నారు. స్పందనకు అన్నిశాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 68,769 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,904 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.33 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

ఇన్‌చార్జి జేసీగా పెంచలకిషోర్



తిరుపతి అర్బన్ : ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్‌గా డీఆర్‌ఓ పెంచల కిషోర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న జేసీ బాలాజీని విజయవాడకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈఓగా బదిలీ చేశారు. ఆ మేరకు ఆయన ఆదివారం తన బాధ్యతలను పెంచలకిషోర్‌కు అప్పగించి రిలీవ్ అయ్యారు.

బేడి ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకం



స్వామివారి సేవలో ఈఓ ధర్మారెడ్డి

తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట వెలసిన శ్రీ బేడి ఆంజనేయస్వామివారికి ఆదివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా ఏటా ప్రత్యేక అభిషేకం జరిపించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా మూలమూర్తికి ఉదయం పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపుతో విశేషంగా అభిషేకం చేశారు. కార్యక్రమంలో టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి, వీజీఓ నంద కిషోర్, పేష్కార్ శ్రీహరి పాల్గొన్నారు.

బాధ్యతగా మానవహక్కుల రక్షణ


తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ లా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథి వీసీ భారతి మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణను అందరూ బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. గుంటూరు ఒకటవ అదనపు జిల్లా న్యాయాధికారి సీహెచ్ రాజ గోపాలరావు జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. విచారణ, కస్టడీ, న్యాయ సమీక్ష, మానవ హక్కులు, ఉల్లంఘనపై అవగాహన కల్పించారు. డాక్టర్ సీతా కుమారి మాట్లాడుతూ మానవ హక్కుల రక్షణకు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ ఎన్.రజనీ, డీన్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్–హ్యూమానిటీస్ ప్రొఫెసర్ కె.అనురాధ, యస్.మాధురీ పరదేశి, ప్రొఫెసర్ సునీతా కాణిపాకం, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

పచ్చ రాతలు.. పచ్చి అబద్ధాలు

తిరుపతిలో అభివృద్ధి పనులు సాఫీగా సాగకూడదు.. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు మౌలిక వసతులు కల్పించకూడదు.. ప్రజాప్రతినిధులకు మంచి పేరు రాకూడదు.. నగర విస్తరణకు అడుగులు పడకూడదు.. ప్రజల జీవన ప్రమాణాలు పెరగకూడదు.. టీడీపీకి రాజకీయ లబ్ధి చేకూరితే చాలు అనే లక్ష్యంతో ఎల్లో మీడియా కుతంత్రాలకు తెరతీస్తోంది. నవ్విపోదురుగాక మాకేంటి అంటూ అసత్య కథనాలతో యథేచ్ఛగా ప్రభుత్వంపై బురదజల్లుతోంది. ఆధ్యాత్మిక క్షేత్రం తిరునగరి ఖ్యాతిని మసకబార్చేలా నిరాధార ఆరోపణలను గుప్పిస్తోంది. భావి తరాలు నష్టపోయినా మాకేంటి.. మా అనుకూల పార్టీకి లాభం చేకూరితే చాలు అన్నట్టు తప్పుడు ప్రచారానికి తెగబడుతోంది. అయితే వాస్తవాలు కనిపెట్టిన ప్రజానీకం మాత్రం పచ్చరాతలు.. పచ్చి అబద్ధాలే అంటూ తేల్చేస్తోంది.

- నవీన తిరుపతి ఆవిష్కరణకు మోకాలడ్డుతున్న ఎల్లోమీడియా
- మాస్టర్ ప్లాన్ రహదారులపై తప్పుడు కథనాలు
- కమర్షియల్ ఏరియాలను వ్యవసాయ భూములంటూ అసత్యాలు
- అభివృద్ధి ప్రదాతలపై బురదజల్లేందుకే ఆరోపణలు

- వెంకటరమణారెడ్డి అనే వ్యక్తికి చెందిన కాటన్ మిల్లు స్థలం నుంచి 4,793 చదరపు గజాలను మాస్టర్ ప్లాన్ రోడ్డు కోసం సేకరించారు. ఎన్నో ఏళ్ల నుంచి పారిశ్రామిక స్థలంగా ఈ భూమి చలామణి అవుతున్న విషయం అందరికీ విదితమే. అయితే టీడీపీ నాయకుడు ఆనం వెంకటరమణారెడ్డి అసత్యాలకు వంత పాడుతూ ఎల్లో మీడియా తప్పుడు ప్రచారానికి తెగబడింది. ఇండస్ట్రియల్ ఏరియా స్థలాన్ని వ్యవసాయ భూమిగా చూపుతూ ప్రజాప్రతినిధులపై అవాస్తవ ఆరోపణలతో కథనాలను వండి వార్చింది. నిబంధనల మేరకు సేకరించిన 4,793 చదరపు గజాలకు సబ్ రిజిస్ట్రార్ విలువ ప్రకారం నాలుగు రెట్లు కేటాయిస్తూ టీడీఆర్ బాండ్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) అందిస్తే.. ప్రజలను గందరగోళపరిచేందుకు విశ్వప్రయత్నం చేస్తోంది.
- తిరుపతి రేణిగుంట రోడ్డులోని హీరో హోండా షోరూమ్, హ్యుందాయ్ షోరూమ్‌కు మధ్యలో పద్మావతీ పురానికి వెళ్లేందుకు మాస్టర్ ప్లాన్ రోడ్డును ఇటీవలే అందుబాటులో తెచ్చారు. ఈ పరిసర ప్రాంతాలు గత 20 ఏళ్లుగా కమర్షియల్ ఏరియాగా నగర ప్రజలకు సుపరిచితమే. ఈ రోడ్డు నిర్మాణానికి కంచి రాము అనే వ్యక్తి తన 3,113 చదరపు గజాల స్థలాన్ని కార్పొరేషన్‌కు గిఫ్ట్ డీడ్‌గా రాసిచ్చారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల మేరకు సబ్‌రిజిస్ట్రార్ విలువ ప్రకారం నాలుగు రెట్లు కేటాయిస్తూ టీడీఆర్ బాండ్ అందజేశారు. అయితే సదరు స్థలం అగ్రికల్చర్ ల్యాండ్ అంటూ తప్పుడు ఆరోపణలు చేశారు. వ్యవసాయ భూమిని కమర్షియల్‌గా చూపించారని పాలకులకు దురుద్దేశాలను ఆపాదించారు. ఇలా టీడీపీ నేతలు ప్రచారం చేస్తున్న అంశాలు.. పచ్చ పత్రికలు ప్రచురిస్తున్న కథనాలు సత్యానికి దూరంగా, అభివృద్ధిని అడ్డుకునేలా ఉన్నట్లు నగర ప్రజలు మండిపడుతున్నారు.



నూతనంగా నిర్మించిన పరాంతక దేవి మార్గం

తిరుపతి తుడా : తిరుపతి నగరాభివృద్ధికి చేటు చేసేలా ఎల్లోమీడియా తప్పుడు రాతలు రాస్తోంది. పాలకులు చిత్తశుద్ధితో తిరునగరి అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుంటే అనవసర విమర్శలతో దుష్ప్రచారం చేస్తోంది. అసత్య కథనాలతో ప్రజలకు ఎనలేని నష్టం చేస్తున్నామనే కనీస స్పృహ కూడా లేకుండా విచ్చలవిడిగా వ్యవహరిస్తోంది. రాజకీయ దురుద్దేశాలను ఆపాదించేందుకే అభాండాలు మోపుతోంది. తాము రాసిందే నిజమని ప్రజలను నమ్మించే ప్రయత్నం తిరుపతి అభివృద్ధికి ప్రమాదకరంగా మారుతోంది. ఓ పార్టీకి రాజకీయ నష్టం కలిగించి తద్వారా మరో పార్టీకి లాభం చేకూర్చే విధంగా అవాస్తవ కథనాలను ప్రచురిస్తున్న విషయాన్ని ప్రజానీకం గమనిస్తోంది.

భవిష్యత్‌లో ఆదాయ వనరులు

ప్రజలకు మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి చేయడం మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యత. ఈ క్రమంలో మరో 5వేల ఎకరాల్లో విస్తరణ, ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించడం, తిరుపతికి కనెక్టివిటీ పెంచడమే లక్ష్యంగా నగర తూర్పు ప్రాంతంలో మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఇందు కోసం కార్పొరేషన్ నుంచి రూ.37కోట్లు కేటాయించారు. కొత్తగా ఏర్పడ్డ రోడ్లలో వందలాది భవనాలు వెలుస్తున్నాయి. భారీ అపార్ట్‌మెంట్లు, ఇళ్లు, పలు కంపెనీలు నిర్మితమవుతున్నాయి. దీంతో వీఎల్‌టీ, భవన నిర్మాణ అనుమతులు, ట్యాక్స్, యూడీఎస్, వాటర్ కనెక్షన్లు, ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా కార్పొరేషన్‌కు కోట్లాది రూపాయలు సమకూరుతున్నాయి. మరో 5 ఏళ్లలో సుమారు 3,500 ఎకరాల్లో తిరుపతి విస్తరించే అవకాశముందని అంచనా వేస్తున్నారు. అంటే కేవలం రూ.37కోట్లతో అభివృద్ధి చేసిన ఆ ప్రాంతాల నుంచి సుమారు రూ.200 కోట్ల మేర కార్పొరేషన్‌కు ఆదాయం చేకూరనుంది. ప్రస్తుతం వంద కోట్ల వార్షిక బడ్జెట్‌తో ఉన్న కార్పొరేషన్ రూ.300కోట్లకు పెరగనుంది.

టీడీపీ హయాంలోనే అనుమతులు

గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి తుడా చైర్మన్‌గా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జి.నరసింహయాదవ్ వ్యవహరించారు. 40 ఏళ్ల బృహత్ ప్రణాళికతో రూ.6 కోట్లు వెచ్చించి తుడా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. 2019 మార్చిలో సార్వత్రిక ఎన్నికల ముందు మాస్టర్ ప్లాన్‌ను ఆమోదించారు. అప్పటి ప్లాన్ ప్రకారం నగర పరిసర ప్రాంతాలలోని 18 రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వ అనుమతితో మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదంతో అభివృద్ధి చేస్తున్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లను ఇప్పటికి ఇప్పుడు ఆమోదించినట్లు, అధికార పార్టీ నాయకుల సొంత భూములకు రోడ్లు వేసుకుంటున్నారంటూ టీడీపీ నేతలు, పచ్చ పత్రికలు తప్పుడు ఆరోపణలు చేస్తుండడం గమనార్హం.

కమిటీ పైనా అక్కసే..!

మాస్టర్ ప్లాన్ రోడ్లను వేగంగా అభివృద్ధి చేయాలన్న సదుద్దేశంతో అధికారులు, కార్పొరేటర్లతో కమిటీ వేశారు. ప్రజాప్రతినిధులతో కమిటీ వేస్తే అదేదో అసాంఘిక చర్యగా ఎల్లో మీడియా నానా రాద్ధాంతం చేస్తోంది. స్థల యజమానులకు అధికారులకు, కార్పొరేటర్లు వారధిగా పనిచేయడంతోనే రోడ్ల నిర్మాణాలు వేగంగా పూర్తవుతున్నాయి. అయితే ఈ కమిటీకి సైతం రాజకీయ రంగు పులిమారు. అలాగే రోడ్లు నిర్మిస్తున్న వార్డుల పరిధిలోని ప్లానింగ్ సెక్రటరీలకు విధుల కేటాయించడాన్ని తప్పు పట్టడం ఆ పత్రికలకే సాధ్యమైంది. సర్వే, ప్లానింగ్ పనులను సంబంధిత సెక్రటరీలు పర్యవేక్షించడం వారి విధుల్లో భాగమనే విషయాన్ని విస్మరించిన పచ్చ పత్రికలు చట్ట విరుద్ధం అన్నట్టు పిచ్చిరాతలు రాయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు రెట్లు ఇవ్వాల్సిందే..

ప్రభుత్వ నిబంధనలు, జీఓ ప్రకారం రోడ్లు అభివృద్ధి చేసే క్రమంలో అక్కడి పరిస్థితుల మేరకు అగ్రికల్చర్, రెసిడెన్షియల్, కమర్షియల్‌గా భూములకు విభజించి ఆ ప్రకారం యజమానులకు టీడీఆర్ బాండ్లతో నష్టపరిహారం చెల్లిస్తారు. కాటన్ మిల్లు, రేణిగుంట రోడ్డు ప్రాంతాలు దశాబ్దాల క్రితమే కమర్షియల్‌గా మారిపోయాయి. ఈ క్రమంలోనే ఆయా ప్రాంతాల్లోని భూ యజమానులకు నాలుగు రెట్ల విలువతో టీడీఆర్ బాండ్‌లు అందజేశారు. సాధారణంగా వీటిని విక్రయించాల్సి వస్తే ఈ బాండ్ విలువలో 35 నుంచి 40 శాతం ధరకు మాత్రమే అమ్ముడవుతాయి. ఈ నేపథ్యంలో అభివృద్ధికి సహకరించిన భూ యజమానులు నష్టపోకుండా విలువను పెంచి ఇవ్వాలని పదేళ్ల క్రితమే ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాలు తెలిసినప్పటికీ ఎల్లోమీడియా మాత్రం బురదజల్లడే అజెండాగా అభివృద్ధికి మోకాలడ్డుతోంది.

టీడీఆర్ బాండ్ల పైనా అసత్యాలే..

రోడ్డు వేయాలనుకున్నప్పుడు ముందుగా సర్వే చేసి ఆ ప్రకారం స్థలం కోల్పోయిన యజమానులను గుర్తించి ముందుగా నోటీసులు ఇస్తారు. ఆపై యజమానులు అంగీకారంతో సేకరించిన స్థలాన్ని గిఫ్ట్ డిడ్ కింద తీసుకుంటారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత సబ్ రిజిస్ట్రార్ నిర్ణయించిన మేరకు సదు భూ యజమానికి నిబంధనల ప్రకారం టీడీఆర్ బాండ్ అందజేస్తారు. 18 మాస్టర్ ప్లాన్ రోడ్ల కోసం మొత్తం 2,31,840 చదరపు గజాలు సేకరించారు. ఇప్పటి వరకు దాదాపు 11 రోడ్లు పూర్తి చేయడంతో ఆ ప్రాంతాలకు చెందిన 330 మందికి టీడీఆర్ బాండ్లు అందజేశారు. మిగిలిన రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇవి పూర్తి చేసుకుంటే మరో 800 మందికి టీడీఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉంది. అయితే రోడ్ల నిర్మాణ పనులు పూర్తి కాకుండానే అందరికీ బాండ్లు ఇవ్వలేదంటూ పచ్చ పత్రికలు ప్రచురించిన కథనాలకు అధికారులు అవాక్కవుతున్నారు.

పెరిగిన భూముల ధరలు

నగర నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌కు వంద మీటర్ల నుంచి తూర్పు వైపునకు ఇటీవల వరకు సరైన రహదారులు లేవు. దీంతో ఈ ప్రాంతంలోని వేలాది ఎకరాల భూములు నిరుపయోగంగా ఉండేవి. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా డాక్టర్ వైఎస్ఆర్, అన్నమయ్య, సామవాయి రహదారాలు అందుబాటులోకి రాగే వందలాది భవనాల నిర్మాణం మొదలైంది. ఈ ప్రాంత భూములకు రెక్కలు వచ్చాయి. ఎవరూ ఊహించన స్థాయికి భూములకు విలువ పెరిగింది. ఏటా రిజిస్ట్రేషన్ శాఖ ఆయా ప్రాంతాల అభివృద్ధిని అంచనా వేసి భూములకు ధరలను నిర్ణయిస్తుంది. ఈ క్రమంలోనే ఈ ఏడాది మార్చిలో నగర తూర్పు ప్రాంతంలో డిస్ట్రిక్ట్ సబ్ రిజిస్ట్రార్ ధరలను ఖరారు చేశారు. ధరలు పెంచే అధికారం మున్సిపల్ కార్పొరేషన్‌కు గాని, ఇతర ఏ వ్యవస్థలకు ఉండదన్న విషయాన్ని విస్మరించిన ఎల్లో మీడియా పాలకులపై మళ్లీ విషం కక్కింది.



కాటన్‌మిల్లు సెంటర్ వద్ద కొత్తగా నిర్మిస్తున్న మాస్టర్ ప్లాన్ రహదారి

అందరికీ ఉద్యోగం.. పరిహారం

పుంగనూరు: జర్మన్ పెప్పర్ మోషన్ ఎలక్ట్రికల్ బస్సుల కంపెనీ ఏర్పాటు కోసం భూములిచ్చిన రైతులకు ఎట్టి పరిస్థితుల్లో నష్టం జరగనివ్వం అని రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఆయన ఆదివారం పుంగనూరులో విలేకరుల సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ భూములిచ్చిన రైతుల ఇంట్లో అర్హులైన వారు ఎంత మంది ఉంటే అందరికీ ఉద్యోగం, పరిహారం, సంతృప్తిగా అందిస్తామని, ఇందులో ఎలాంటి అనుమానాలకు, అపోహలకు తావులేదని రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. జర్మన్ బస్సుల కంపెనీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనుమతి ఇవ్వడం ఎంతో అదృష్టమన్నారు. పుంగనూరు వెనుకబడిన ప్రాంతం కావడంతో ముఖ్యమంత్రి బస్సుల పరిశ్రమను పుంగనూరుకు కేటాయించారని తెలిపారు. అనంతపురంలో కార్ల పరిశ్రమతో ఆ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు. అదే విధంగా మన ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుతో ఎంతో అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. జర్మన్ కంపెనీ వారు త్వరలోనే భూసేకరణకు సంబంధించి నిధులు కలెక్టర్ వద్ద డిపాజిట్ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం వేగవంతంగా సాగుతోందన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో పుంగనూరు నియోజకవర్గంలో భూముల ధరలు పెరుగుతుందన్నారు. నిరుద్యోగులకు ఉపాధితోపాటు వ్యాపారులకు అన్ని రకాలుగా బస్సుల కంపెనీ ఉపయోగపడుతాయన్నారు. ఇలాంటి పరిశ్రమల ఏర్పాటు సమయంలో ప్రజలందరూ సహకరించి, అభివృద్ధికి అండగా నిలవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఈ కృష్ణారెడ్డి, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి పాల్గొన్నారు.



ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వైభవంగా గరుడోత్సవం



రాపూరు: మండలంలోని పెంచలకోనలో శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామివారు ఆదివారం బంగారు గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీవారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం కావడంతో మూల మూర్తిని చందనంతో అలంకరించడం ఆనవాయితీ. ఈ మేరకు స్వామివారికి ఉదయం అభిషేకం, చందన అలంకరణ చేపట్టారు. అనంతరం శాంతి హోమం, కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం శ్రీవారి అత్యంత ప్రియమైన వివిధ పుష్పాలు,ఆభరణాలతో శ్రీవారిని అలంకరించి గరుడుని కొలువుదీర్చారు. మేళతాళాలు మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు.

సేంద్రియం..సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాళహస్తి: సేంద్రియ పద్ధతులతో సాగు చేసిన వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఏపీ సీడ్స్‌లో ఐపీటీడీ శాస్త్రవేత్త డాక్టర్ మోహన్‌కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథులుగా ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం హాజరయ్యారు. ముందుగా ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలన్నారు. పంటలకు రసాయన ఎరువులు, పురుగు మందులు వాడడం వల్ల ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారని వెల్లడించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మట్లాడుతూ ఐపీటీడీ ఆధ్వర్యంలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తారన్నారు. గతంలో పేడను ఎరువుగా వాడుకుని పంటలను పండించేవారని, అందుకే పెద్దల కాలంలో 80 నుంచి 90 ఏళ్లపాటు ఆరోగ్యంగా జీవించారని వివరించారు. దిగుబడి తక్కువగా ఉన్నా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు ఎక్కువ రేటు ఉంటుందని తెలిపారు. తొట్టంబేడు మండలం పూడి గ్రామానికి చెందిన శ్యామ్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రకృతి వ్యవసాయం చేపట్టి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని వెల్లడించారు. సేంద్రియ సాగుపై అవగాహన కల్పించే బ్రోచర్ ఆవిష్కరించారు. రైతులకు కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాల కమిటీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ప్రకాష్ యాదవ్, ఉన్నం వాసునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారెడ్డి, ముత్యాల పార్థసారథి, వయ్యాల కృష్ణారెడ్డి, బత్తిరెడ్డి, మణినాయుడు, ప్రభాకర్‌రెడ్డి, రమణయ్యయాదవ్, వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి, చంద్రయ్యనాయుడు, రెడ్డి శేఖర్, బోర్డు మెంబరు భాస్కర్, సుమతి, నాయకులు శివకుమార్‌యాదవ్, పఠాన్ ఫరీద్, పసల కృష్ణయ్య, పవన్ పాల్గొన్నారు.



సదస్సులో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తదితరులు

లక్ష్మీనృసింహునికి విశేషాభిషేకం

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి వైభవంగా ఆదివారం విశేషాభిషేకం నిర్వహించారు. కార్తీక మాసంలో స్వాతి తిరు నక్షత్రం సందర్భంగా ఏటా ప్రత్యేక అభిషేకం జరిపించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా మూలమూర్తికి ఉదయం అర్చకులు శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు.

● పులికాట్.. పడవ షికార్!



పులికాట్ జలకళ సంతరించుకుంది. వలస విహంగాల ఆహార వేట మొదలైంది. రంగు రంగుల పక్షులను వీక్షించేందుకు పర్యాటకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఈ క్రమంలో వాటంబేడు కుప్పానికి చెందిన మత్స్యకారులు తమ పడవను షికారుకు సిద్ధం చేశారు. రూ.100 టికెట్టుతో సరస్సులో విహారానికి తీసుకెళుతున్నారు. బర్డ్స్‌వాచ్ టవర్‌కు ఇరువైపుల నుంచి బోటులో వెళుతూ పక్షులను పరిశీలించేందుకు సందర్శకులు ఉత్సాహం చూపుతున్నారు. - సూళ్లూరుపేట

విద్యార్థుల ఉన్నతికి సాక్షి మ్యాథ్స్‌బీ..స్పెల్‌బీ

తిరుపతి ఎడ్యుకేషన్‌ : సాక్షి మీడియా గ్రూప్‌ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి వేదికగా మ్యాథ్స్‌బీ సెమీ ఫైనల్స్‌, స్పెల్‌బీ క్వార్టర్‌ ఫైనల్స్‌ పరీక్షలు నిర్వహించారు. తిరుచానూరు రోడ్డు, శ్రీనివాసపురంలోని హోలీ గ్రీన్‌ పాఠశాలలో చేపట్టిన పరీక్షలకు తిరుపతి, చిత్తూరు తదితర ప్రాంతాల్లోని పలు విద్యాసంస్థల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల యాజమాన్యాలతో కలిసి హాజరయ్యారు.


మ్యాథ్స్‌ బీ, స్పెల్‌ బీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

పోటీ ప్రపంచంలో రాణించేలా..

ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించేందుకు గణితం, ఆంగ్లంపై పట్టు తప్పనిసరి. గణితంలో ఫార్ములాలు, ఆంగ్ల భాషపై పట్టు, ఈ రెండింటిలో నైపుణ్యం ఉంటే ఉన్నతంగా రాణించగలుగుతాం. వీటి ప్రాధాన్యతను గుర్తించిన సాక్షి మీడియా గ్రూప్‌ గణితం, ఆంగ్ల భాషపై విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తూ వారిని ఆ రెండు సబ్జెక్టుల్లో నైపుణ్యం సాధించేలా ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఏటా మ్యాథ్స్‌బీ, స్పెల్‌బీ పరీక్షలు నిర్వహిస్తోంది. పాఠశాల స్థాయి, క్వార్టర్‌, సెమీస్‌, ఫైనల్స్‌ విభాగాల్లో ఈ పరీక్షలను నిర్వహించి విద్యార్థులను నగదు, ఇతర బహుమతులతో సత్కరిస్తోంది. ఈ ఏడాది ఈ రెండు పరీక్షలకు ప్రధాన స్పాన్సర్‌గా డ్యూక్స్‌ వేఫి, అసోసియేషన్‌ స్పాన్సర్‌గా రాజమండ్రికి చెందిన ట్రిప్స్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌ వ్యవహరిస్తున్నాయి.

మ్యాథ్స్‌బీ సెమీస్‌...

మ్యాథ్స్‌బీ సెమీ ఫైనల్స్‌ పోటీలకు విశేష స్పందన లభించింది. ఉదయం 9నుంచి 10గంటల వరకు అన్ని కేటగిరీలకు నిర్వహించిన ఈ పరీక్షకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరై తమ మేధస్సుకు పదును పెట్టారు.

స్పెల్‌బీ క్వార్టర్‌ ఫైనల్స్‌..

పాఠశాల స్థాయి స్పెల్‌బీలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు క్వార్టర్‌ ఫైనల్స్‌ నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటలకు నాలుగు కేటగిరీల్లో జరిగిన పరీక్షకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చారు. స్పెల్‌బీ పరీక్ష రాయడానికి విద్యార్థులు ఆసక్తి కనబరిచారు. ఇంగ్లిష్‌ భాషపై తమకున్న పట్టు, ప్రతిభను పరీక్షించుకున్నారు. స్పెల్‌బీ ద్వారా తమలో నైపుణ్యం, సామర్థ్యం పెరిగిందని, భాషపై పట్టు సాధించుకుంటున్నామని, కొత్త పదాలు, స్పెల్లింగులు, పదాల ఉచ్ఛారణ వంటి సరికొత్త విషయాలు తెలుసుకుంటున్నామని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

నాలుగు కేటగిరీల్లో..

సాక్షి స్పెల్‌బీ క్వార్టర్‌ ఫైనల్స్‌లో ఒకటవ కేటగిరీ కింద 1, 2వ తరగతులకు, రెండో కేటగిరీ కింద 3,4వ తరగతులకు, మూడో కేటగిరీ కింద 5, 6, 7వ తరగతులకు, నాలుగో కేటగిరీ కింద 8నుంచి పదో తరగతి వరకు లైవ్‌ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులు సెమీఫైనల్‌ పరీక్షకు అర్హత సాధించనున్నారు.

కార్యక్రమంలో సాక్షి ఈవెంట్స్‌ ఇన్‌చార్జి టి.చంద్రశేఖర్‌, ఏడీవీటీ సిబ్బంది భాస్కర్‌, సుబ్బారావు, అయోధ్యాపురం ధర్మారెడ్డి, పాఠశాల అడకమిక్‌ డైరెక్టర్‌ ఓ.మురళి పాల్గొన్నారు.

పోటీ ప్రపంచానికి సరైన వేదిక



ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించేందుకు సబ్జెక్టు పరంగానే కాకుండా అన్ని అంశాల్లో నైపుణ్యం కలిగి ఉండాలి. కొంతమంది విద్యార్థులకు గణితం, ఇంగ్లిష్‌ అంటే కొంత భయం ఉంటుంది. సరైన విధానంలో వారికి బోధించలేనప్పుడు ఈ భయం మరింత పెరుగుతుంది. ఈ భయాన్ని పోగొట్టేందుకు, వారిలో ఆసక్తి పెంపొందించి చదువులో బాగా రాణించేందుకు సాక్షి నిర్వహిస్తున్న మ్యాథ్స్‌బీ, స్పెల్‌బీ ఎంతో దోహదపడుతుంది.

– సి.వేణుగోపాల్‌రెడ్డి, చైర్మన్‌, హోలీగ్రీన్‌ స్కూల్‌

తల్లిదండ్రులు ప్రోత్సహించాలి



నేటి సమాజంలో విద్యార్థులు ఉన్నతంగా రాణించగలిగితేనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరగలరు. దీనికోసం పాఠ్యాంశాల్లో ముఖ్యమైన మ్యాథ్స్‌, ఇంగ్లిష్‌లో పట్టు సాధించగలగాలి. దీన్ని దృష్టిలో ఉంచుకునే సాక్షి మీడియా గ్రూప్‌ ఏటా మ్యాథ్స్‌ బీ, స్పెల్‌ బీ నిర్వహిస్తూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను పెంపొందించేందుకు కృషి చేస్తోంది. ఇలాంటి పరీక్షలపై తల్లిదండ్రులు అవగాహన పెంపొందించుకుని తమ పిల్లలను ప్రోత్సహించాలి.

– బి.హరినాథరెడ్డి, డైరెక్టర్‌, హోలీగ్రీన్‌ స్కూల్‌

కొత్త పదాలు తెలిశాయి



స్పెల్‌బీ పరీక్షలో పాల్గొనడం ద్వారా ఇంగ్లిష్‌ భాషలోని కొత్త పదాలను తెలిశాయి. ఆ పదాల స్పెల్లింగ్‌ నేర్చుకున్నా. వాటిని ఎలా ఉచ్ఛరించాలనే విషయాలను మా టీచర్లు నేర్పించారు. స్పెల్‌బీ క్వార్టర్‌ ఫైనల్‌ పరీక్ష బాగా రాశా. ఫైనల్‌కు చేరుకోవడమే నా లక్ష్యం.

– ఎస్‌.లాస్యా రెడ్డి, 4వతరగతి, ప్రశాంత్‌ ఇంగ్లిష్‌ మీడియం స్కూల్‌, తిరుపతి

ఆసక్తి పెరిగింది



స్పెల్‌బీ పరీక్షలో తొలిసారిగా పాల్గొన్నా. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరచి క్వార్టర్‌ ఫైనల్‌కు చేరడం సంతోషంగా ఉంది. ఇంగ్లిష్‌ భాషపై పట్టు సాధించడంతో పాటు మరింతగా నైపుణ్యం సాధించాలన్న ఆసక్తి పెరిగింది. థ్యాంక్స్‌ టు సాక్షి.

– ఎ.అర్షిత, 4వ తరగతి, క్యాంఫోర్డ్‌ స్కూల్‌, చిత్తూరు

బాగా ఉపయోగపడింది



స్పెల్‌బీ పరీక్షలో మొదటిసారి పాల్గొన్నా. క్వార్టర్‌ ఫైనల్‌కు చేరడం ఆనందంగా ఉంది. పాఠ్యాంశాల్లోని ఇంగ్లిష్‌ పదాలతో పాటు స్పెల్లింగ్స్‌, ఉచ్ఛారణ తెలిసింది. మరింతగా నైపుణ్యం సాధించేందుకు స్పెల్‌బీ నాకు బాగా ఉపయోగపడింది.

– వి.రోహాణ్‌, 5వ తరగతి, విశ్వం విద్యాసంస్థ, తిరుపతి

ఫైనల్స్‌కు వెళ్లడమే లక్ష్యం



స్పెల్‌బీ పరీక్షలకు రెండో పర్యాయం హాజరయ్యా. గత ఏడాది సెమీ ఫైనల్‌ వరకు వెళ్లా. ఈ ఏడాది ఎలాగైనా సెమీస్‌లో అర్హత సాధించి ఫైనల్‌కు వెళ్లడమే లక్ష్యం. దీనికోసం స్పెల్‌బీ మెటీరియల్‌ను సాధన చేశా. కొత్త పదాలకు స్పెల్లింగ్‌లు, ఉచ్ఛారణ తెలుసుకున్నా. స్పెల్‌బీ వల్ల ఇంగ్లిష్‌ భాషపై పట్టు సాధిస్తున్నా.

– పి.ధనశ్రీ, 7వ తరగతి, జేసీఆర్‌ చైతన్య స్కూల్‌, తిరుపతి

సాధన చేశా



సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ పరీక్షకు బాగా సాధన చేశా. స్పెల్‌బీ మెటీరియల్‌లో చాలా కొత్త పదాలున్నాయి. ఆ పదాలకు స్పెల్లింగ్స్‌ నేర్చుకున్నా. కొత్త పదాలను ఎలా ఉచ్ఛరించాలి, ఆ పదాలకు అర్థాలను మా ఇంగ్లిష్‌ టీచర్‌ నేర్పించారు.

– దియా విశ్వనాథన్‌, 7వ తరగతి, ఎడిఫై పాఠశాల,తిరుచానూరు

వైభవం.. కార్తీక వనమహోత్సవం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని భరద్వాజ తీర్థం వద్ద ఆదివారం వైభవంగా కార్తీక వనమహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత భరద్వాజేశ్వరస్వామివారికి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. ఉసిరి చెట్లను స్వామి, అమ్మవార్లుగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం ముక్కంటి ఆలయం తరపున వన భోజనాలు వడ్డించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు విశిష్టమైనవన్నారు. కులమతాలకు అతీతంగా అందరినీ ఐకమత్యంతో ఉంచడమే వన భోజనాల ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. ఆలయం తరపున రుచికరమైన భోజనం ఏర్పాటు చేసిన పాలకమండలికి, అధికారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ అంజూరు తారక శ్రీనివాసులు, ప్రధాన అర్చకుడు కరుణాకర్‌ గురుకుల్‌, పాలక మండలి సభ్యులు సాధన మున్నా, బుల్లెట్‌ జయశ్యామ్‌, రమాప్రభ, ప్రత్యేక ఆహ్వాన సభ్యులు శ్రీదేవి, చింతామణి పాండు, జూలుగంటి సుబ్బారావు, ముత్యాల పార్థసారథి, అసిస్టెంట్‌ కమిషనర్‌ మల్లికార్జున ప్రసాద్‌, ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ నూక రత్నమ్మ, డిప్యూటీ ఈఓ వెంకటసుబ్బయ్య, ఏఈఓ ధనపాల్‌, లోకేష్‌ రెడ్డి, సతీష్‌ మాలిక్‌, డీఈ శ్రీనివాస్‌ రెడ్డి, సూపరింటెండెంట్‌ శ్రీహరి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సుబ్రమణ్యం, ఆలయ కమిటీ చైర్మన్‌ శ్రీనివాసులు

లైన్‌మన్‌కు కరెంట్‌ షాక్‌

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు సబ్‌ స్టేషన్‌ పరిధిలో సీనియర్‌ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఏలుమలై ఆదివారం కరెంట్‌ షాక్‌ గురై తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. తొండంబట్టు వద్ద గ్రామ పంచాయతీకి నీటి సరఫరా కోసం త్రీ ఫేస్‌ మోటారుకు విద్యుత్‌ సరఫరా ఇచ్చేందుకు వెళ్లాడు. సరఫరా ఇచ్చిన కొద్దిసేపటికే లైన్ల మీద చెట్టు కొమ్మ పడడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ ఫ్యూజులు కాలిపోయాయి. అయితే చెట్టు కొమ్మ తొలగించేంత వరకు విద్యుత్‌ సరఫరా ఇచ్చేందుకు వీలు కాదని, మరో ఫ్యూజును తొలగించేందుకు కరెంటు స్తంభం ఎక్కిన ఆయనకు రిటర్న్‌ సప్లై కావడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. సహచర సిబ్బంది స్థానికుల సహకారంతో తిరుపతికి తరలించారని, ఏలుమలై ప్రస్తుతం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఏఈ శివప్రసాద్‌ తెలిపారు.

జెర్రిపోతు కలకలం

తిరుమల : తిరుమల గోగర్భం డ్యామ్‌ సబ్‌స్టేషన్‌ వద్ద ఆదివారం జెర్రిపోతు కలకలం సృష్టించింది. వెంటనే టీటీడీ అటవీశాఖ ఉద్యోగి భాస్కర్‌నాయుడుకు సమాచారం అందించారు. ఆయన సబ్‌స్టేషన్‌కు చేరుకుని ఆరు అడుగుల పామును చాకచక్యంగా పట్టుకుని అటవీప్రాంతంలో విడిచిపెట్టారు.


పాముతో భాస్కర్‌నాయుడు

వైభవంగా ప్రదోష పూజలు

నాగలాపురం: సురుటుపల్లి శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రదోష పూజలను వైభవంగా నిర్వహించారు. నందీశ్వరునికి, వాల్మీకిస్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. ఉభయదారులుగా ఊత్తుకోట్టైకి చెందిన వినోద్‌ వ్యవహరించారు. వీరికి ఆలయ చైర్మన్‌ ఏవీఎం బాలాజి రెడ్డి ఆలయ మర్యాదలతో దర్శనం ఏర్పాటు చేసి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు కె.ఆనంద్‌, జి.మునివేలు, పి.కవిత సందీప్‌, అర్చకులు పాల్గొన్నారు.

జగనన్నతోనే బీసీల అభ్యున్నతి


బీసీ సమ్మేళనంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

శ్రీకాళహస్తి : జగనన్నతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం పట్టణంలోని రోటరీ క్లబ్‌లో రత్నం రెడ్డి ఆధ్వర్యంలో బీసీ సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీలకు 64శాతం రిజర్వేషన్లతో పదవులు కట్టబెట్టిందన్నారు. ఎన్‌టీ రామారావు తర్వాత రాష్ట్రంలో బీసీల ఆత్మగౌరవం నిలబెట్టింది ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రెండు ఎమ్మెల్సీలను బీసీలకు ఇచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఆయన బాటలోనే ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పయనిస్తున్నారని, నామినేటెడ్‌ పోస్టుల్లో బీసీలకు పెద్దపీట వేస్తున్నారని వెల్లడించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదన్‌రెడ్డినే మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత బీసీలపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ నాయకులు వడ్లతాంగాళ్‌ బాలాజీ ప్రసాద్‌ రెడ్డి, పురుషోత్తం గౌడ్‌, బుజ్జి రెడ్డి, వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మధు, వన్నె కుల క్షత్రియ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ భరత్‌రెడ్డి, మన్నేపల్లి శ్రీనివాసులు, గాంధీ, ఉమాసింగ్‌ , లక్ష్మీపతి రెడ్డి, తపాలా దామోదర్‌ రెడ్డి, బజాజ్‌ మురళి, కృష్ణారెడ్డి, కిట్టు మేస్త్రి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు

రేపటి నుంచి సత్వ ఇన్ఫోటెక్‌ ప్లేస్‌మెంట్స్‌

తిరుపతి కల్చరల్‌: సాఫ్ట్‌వేర్‌ టెక్నాలజీపై డిగ్రీ, పీజీ అభ్యర్థులు పట్టు సాధించేలా చేసి ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా సత్వ ఇన్ఫోటెక్‌ కృషి చేస్తోందని, అందులో భాగంగానే ఈనెల 12, 13వ తేదీల్లో ప్లేస్‌మెంట్స్‌ నిర్వహించనున్నట్లు సంస్థ ఎండీ గిరీష్‌కుమార్‌ కుప్పిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ ప్లేస్‌మెంట్స్‌ ద్వారా మంచి ప్యాకేజీతో ఏదైనా డిగ్రీ, పీజీ, బీటెక్‌ ఉత్తీర్ణత సాధించిన వారికి ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం మదనపల్లె విశ్వం ఇంజినీరింగ్‌ కళాశాలలో, బుధవారం పుత్తూరు కార్వేటినగరం రోడ్డులోని ఎస్వీ పెరుమాళ్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌లో ప్లేస్‌మెంట్స్‌ ఉంటాయని వివరించారు. వివరాలకు సత్వ ఇన్ఫోటెక్‌ డాట్‌కామ్‌ వెబ్‌సైట్‌ సందర్శించాలని సూచించారు.

నివాళులర్పిస్తూ.. తోడుగా నిలుస్తూ..!


రామచంద్రయ్యనాయుడుకు అంజలి ఘటిస్తున్న తుడా చైర్మన్‌ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల : మండలంలోని శంఖంపల్లె, కనుముందరపల్లె, గురురంగయ్యగారిపల్లెలో మృతి చెందిన ముగ్గురికి తుడా చైర్మన్‌, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శనివారం విద్యుదాఘాతంతో మరణించిన వలంటీర్‌ సుభాషిణి(35) స్వగ్రామం శంఖంపల్లికి మోహిత్‌రెడ్డి చేరుకుని ఆమె మృతదేహానికి అంజలి ఘటించారు. మృతురాలి భర్త మురళి, కుమార్తె యశశ్రీ, కుమారుడు డోలచంద్‌ను ఓదార్చారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రూ.20 వేలు నగదును మురళికి అందజేశారు. అలాగే లింగనపల్లి పంచాయతీ కనుముందరపల్లెలో రామచంద్రయ్య నాయుడు పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం ఇరుగురంగయ్యగారిపల్లిలో నాగభూషణం భౌతిక కాయానికి పూలమాల వేసి కుటుంబీకులకు సంతాపం తెలిపారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ నంగా నరేష్‌రెడ్డి, ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి, పార్టీ డివిజన్‌ అధ్యక్షులు కపిలేశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, బాబురెడ్డి, శ్యామలా, లోకనాథరెడ్డి, బాబు పాల్గొన్నారు.


వలంటీర్‌ సుభాషిణి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మోహిత్‌రెడ్డి

పరామర్శలు

సామిరెడ్డిపల్లి పంచాయతీ కనుముందరపల్లెలో విశ్రాంత ఉపాధ్యాయుడు రఘునాథరెడ్డి కర్మక్రియలకు మోహిత్‌రెడ్డి హాజరయ్యారు. ఇరంగారిపల్లె పంచాయతీ తలారిపల్లె పార్టీ యూత్‌ లీడర్‌ గుణశేఖర్‌ తండ్రి రాజేంద్ర కర్మక్రియలకు హాజరై కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. అనంతరం కె.వడ్డేపల్లెలో పార్టీ నాయకుడు ఈశ్వర్‌రెడ్డిని పరామర్శించారు. వారి తల్లి జానకమ్మ మృతికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ట్రాక్టర్‌ బోల్తా పడి రైతు దుర్మరణం

గంగాధర నెల్లూరు: మండలంలోని పాత వెంకటాపురం పంచాయతీ అగ్రహారానికి చెందిన రైతు మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు గంగాధర నెల్లూరు మండలం పాతవెంకటాపురానికి చెందిన గోపి నాయుడు (42) ఆదివారం ఉదయం వరి పైరు నాటడానికి తన పొలాన్ని దున్నుతున్న సమయంలో రోటోవేటర్‌ తిరగబడడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.


మృతి చెందిన గోపి నాయుడు

స్కూటర్‌ను ఢీకొన్న కారు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : మండలంలోని తంగేళ్లపాళెం క్రాస్‌ వద్ద ఆదివారం కారు ఢీకొనడంతో స్కూటరిస్టు గాయపడ్డాడు. వివరాలు.. బుచ్చినాయుడు కండ్రిగ మండలం పెద్దపాలేడుకు చెందిన నరసింహారెడ్డి(62) స్కూటర్‌పై తన స్వగ్రామానికి వస్తుండగా వెనుక నుంచి కారు ఢీకొంది. క్షతగాత్రుడిని తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాఘవేంద్ర తెలిపారు.

త్వరలో క్షత్రియ భవన నిర్మాణం


సమావేశంలో మాట్లాడుతున్న క్షత్రియ నేత కేఎల్‌ శర్మ

తిరుపతి కల్చరల్‌: నగరంలో త్వరతో క్షత్రియ భవన నిర్మాణం చేపట్టనున్నట్లు రాష్ట్ర క్షత్రియ సేవా సంఘ నేతలు వెల్లడించారు. ఆదివారం ఓ ప్రైవేటు హోటల్లో రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. సంఘం గౌరవాధ్యక్షుడు శివరామరాజు, అధ్యక్షుడు బలరామరాజు మాట్లాడుతూ త్వరలో తిరుపతిలో అన్ని వసతులతో కూడిన క్షత్రియ భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. మూడు నెలల్లో భూమి పూజ నిర్వహించి రాష్ట్రంలోని క్షత్రియ సంఘం నేతలను ఆహ్వానించనున్నట్లు చెప్పారు. బిల్డింగ్‌ నిర్మాణాన్ని పవర్‌ ప్రెసెంటేషన్‌ ద్వారా ప్రభాకర్‌ రాజు వివరించారు. సంఘ కార్యదర్శి నారాయణబాబు రాజు, రవిరాజు, శ్రీధర్‌రాజు, బాలరాజు, వీరేంద్ర వర్మ మోహన్‌రాజు, శ్రీధర్‌ వర్మ, సుకుమార్‌ రాజు ప్రసంగించారు. అనంతరం ఏపీ ప్రైవేట్‌ స్కూల్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రమణ్యం రాజు, బాలరాజులను సత్కరించారు.

దుమ్మురేపిన ఎడ్ల పందేలు

శ్రీరంగరాజపురం: యువత కేరింతలు... జనం చప్పట్లు... కోడె గిత్తల జోరుతో మండలంలోని ఉడలమకుర్తి పంచాయతీ ఎస్‌ఎండీ పురంలో ఆదివారం నిర్వహించిన ఎడ్ల పందేలు దుమ్మురేపాయి. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ఎడ్ల పందేలు నిర్వహించడం ఆనవాయితీ. ముందుగా ఎడ్లకు పలకలు, బెలూన్‌లు కట్టి పందేనికి ఉసిగొల్పారు. అంతకు ముందే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్న యువత అల్లి వద్ద పలకల కోసం నిలబడ్డారు. ఈలలు వేస్తూ తరిమిన కోడెగిత్తలు రంకెలేసుకుంటూ జనాలపై దూసుకుపోయాయి. ఎడ్లను నిలువరించి పలకలు పట్టేందుకు యువత పోటీ పడ్డారు. పలకలు పట్టిన యువత విజయ దరహాసంతో చిందులు వేశారు. అయితే కొన్ని ఎడ్లు జన ప్రవాహాన్ని సైతం లెక్కచేయకుండా దూసుకెళ్లాయి. ఎడ్ల కొందరు ఎడ్ల కింద పడి గాయపడ్డారు.